క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తెనాలిటౌన్: కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు

ఉర్దూ పాఠశాలలను తనిఖీ చేసిన డీఐఎస్



విద్యార్థులతో పాఠ్యపుస్తకాన్ని చదివిస్తున్న ఖాసీం

తెనాలిఅర్బన్: స్థానిక పినపాడు, నాజరుపేటలోని మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను జిల్లా డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఉర్దూ స్కూల్స్ ఎండీ ఖాసీం శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యపుస్తకాలు చదివించి, వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. వసతులపై ఆరా తీసి, జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

కుష్ఠు నివారణకు కృషి చేయాలి

కొల్లిపర: కుష్ఠు నివారణకు సమష్టిగా కృషి చేయాలని డాక్టర్ కొత్తపల్లి బాబురావు చెప్పారు. శుక్రవారం మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు వ్యాధిపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 13 వరకు ప్రతి గ్రామంలో పక్షోత్సవ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీపీఎంఓ జంగం శ్యామ్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల లెప్రసీ నోడల్ అధికారి అందెబాల చంద్రమౌళి, కమ్యూనిటీ వైద్యశాల ఆరోగ్యఅధికారి దాసరి స్వరూపరాణి, ఎంపీహెచ్ఓ వంగర బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠుపై అవగాహన సదస్సు

తెనాలిటౌన్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని పురవేదికపై శుక్రవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, డాక్టర్ భరద్వాజ్, హెచ్ఈవో టి.నాగరాజు, సూపర్‌వైజర్లు జి.శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, ఎఎన్ఎం లక్ష్మీ శిరీష, గజలక్ష్మి, జ్యోతి, హెచ్‌ఏ మహేష్, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'తో ప్రయోజనం

కొల్లిపర: ఆయుష్మాన్ భారత్ పథకంతో ఉచితంగా రూ.5 లక్షల వరకు వైద్యం అందుతుందని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయుష్మాన్ భారత్ పథకం సాంకేతిక బృందం పంచాతీ కార్యదర్శులు, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, వలంటీర్లకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సమతవాణి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

గాయకుడు బైరాగికి సన్మానం



బైరాగిని సన్మానిస్తున్న దృశ్యం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం తోడూనీడా చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం ప్రముఖ గాయకుడు కూనపరెడ్డి బైరాగిని సన్మానించారు. కార్యక్రమంలో పోలవరపు జనార్దన్, వీరమాచినేని వెంకట సుబ్బారావు, చిరువెళ్ల సుబ్రమణ్యం, రాంశెట్టి శివశంకర్, భోగ్యం శ్రీనివాసరావు, కూనపరెడ్డి ఉమామహేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవల కార్యాలయం ప్రారంభం

తెనాలిరూరల్: స్థానిక బోసు రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయం వెనుక ప్రాంతంలో అన్ని వర్గాల వారికి ఉచిత సేవలు అందించేలా నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. శ్రీకృష్ణ దేవరాయ ప్రాంగణం పేరుతో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఇస్రో, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు ప్రారంభించారు. కార్యాలయంలో చార్టర్డ్ అకౌంట్స్ విభాగాన్ని డీఎల్ కాంతారావు, కృష్ణారెడ్డి ప్రారంభించగా ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని న్యాయవాది వెలినేని రాఘవయ్య, ఉచిత కాంపిటేటివ్ లైబ్రరీని మండలనేని శివయ్య, ఉచిత వివాహ పరిచయ వేదికను తోటకూర వెంకట రమణారావు, పోస్ట్ పబ్లికేషన్స్‌ను ఎం.తిరుమలరావు, స్వామి వివేకానంద వసతి గృహాన్ని దంతాల ప్రేమ్ కుమార్, శశాంక్, పోస్ట్ స్టడీ సర్కిల్‌ను బీఎస్ఎన్ ప్రారంభించారు.

చేతి వృత్తిదారులకు చేదోడు

- చిరుజీవుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- జగనన్న చేదోడు పథకం చెక్కు పంపిణీ సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: చేతి వృత్తిదారుల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ.పదివేల ఆర్థిక సాయం అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. గత మూడేళ్లలో ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 927.39 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారని కొనియాడారు. ఇటీవల మూడోవిడతగా వినుకొండలో జరిగిన సభలో 3.30 లక్షల మంది లబ్ధిదారులకు రూ.330 కోట్లను వారి ఖాతాల్లోకి బదిలీ చేసినట్టు శివకుమార్ గుర్తుచేశారు. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శుక్రవారం పట్టణంలోని 757 మంది లబ్ధిదారులకు రూ.75.70 లక్షల నమూనా చెక్కును ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. సభలో మాట్లాడుతూ చేదోడు పథకం ద్వారా నియోజకవర్గంలో ఈ ఏడాది 1,342 మందికి రూ.1.34 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. పట్టణం వరకు చూస్తే గత రెండేళ్లలో 2,505 మందికి రూ.2.50 కోట్లు ఆర్థికసాయం అందినట్టు వివరించారు. అదేవిధంగా గతంలో పట్టణంలో 23 వేలమందికి పింఛన్లు వస్తే, తమ హయాంలో ప్రతినెలా 37,474 మందికి రూ.10 కోట్లను ఒకటో తేదీన పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంతో జీవన ప్రమాణాలు పెంచుకుంటున్నట్టు లబ్ధిదారులు గడప గడపకు కార్యక్రమంలో తన దృష్టికి తీసుకొస్తున్నారని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అవినీతికి, వివక్షకు తావులేకుండా లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధిని నేరుగా అందిస్తోందని చెప్పారు. సాంకేతిక కారణాలతో ఇటీవల వెయ్యిమంది పెన్షన్‌దారులకు నోటీసులు జారీచేయగా, విచారించి 774 మందిని అర్హుల జాబితాలో చేర్పించినట్టు వివరించారు.

వృత్తిదారులు ఉన్నతస్థాయికి చేరాలనే..

మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ చేతివృత్తిదారులు ఉన్నతస్థాయికి చేరాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొడాలి క్రాంతికుమార్, పట్టణ అధ్యక్షుడు కోలా వాసు, పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పెసర్లంక రమణ, పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యద్దనపూడి శివ, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, నేతలు తాడిబోయిన రమేష్, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్, టెక్స్ బాల, షేక్ మీరావలి, కాకి దేవసహాయం పాల్గొన్నారు. మెప్మా అధికారి మాధవరావు స్వాగతం పలికారు.

అడగకుండానే సాయం



కరోనా సమయంలో మా కుటుంబం బాగా దెబ్బతింది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంతో ఇప్పుడు చాలా భరోసాతో ఉంటున్నాం. అమ్మఒడి వస్తోంది. ఇంటిస్థలం ఇచ్చారు. రూపాయి సాయం చేస్తేనే నాకేమొస్తుంది అని చూసే రోజుల్లో అడగకుండానే చేదోడు సాయం చేస్తున్నారు.

– దాసరి రాధ, తెనాలి

రాదనుకున్నా లబ్ధి చేకూరింది



జగనన్న చేదోడు డబ్బులు రెండు పర్యాయాలు వచ్చాయి. ఈసారి రెన్యువల్ చేయాల్సిన సమయంలో ఊరెళ్లాల్సి వచ్చింది. రాదేమో అనుకున్నా.. గడువు పొడించి మరీ అధికారులు నాకు ఆర్థికసాయం అందేలా చూశారు. మాకు అమ్మఒడి వస్తోంది. అమ్మకు పింఛను వస్తోంది. చాలా సంతోషంగా ఉంది.

– బండికళ్ల శ్రీకాంత్‌బాబు, తెనాలి

అన్ని పథకాలూ వస్తున్నాయి



జగనన్న ప్రభుత్వంలో మాకు అన్ని పథకాలు వస్తున్నాయి. పింఛను వస్తోంది. అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. విద్యాదీవెన సాయం అందుతోంది. జగనన్న చేదోడు ఆర్థికసాయం డబ్బులు వస్తున్నాయి. జగనన్నకు, శివన్నకు ధన్యవాదాలు.

– కడియాల అనూరాధ, తెనాలి

ఇళ్లస్థలంతో సహా సంక్షేమ లబ్ధి



నాకు డ్వాక్రా రుణమాఫీ వచ్చింది. ఇళ్లస్థలం ఇచ్చారు. జగనన్న చేదోడు లబ్ధి ఏటా అందుతోంది. ఏమని చెప్పాలి ఈ ప్రభుత్వం గురించి, మాలాంటి ఎందరినో ఆదుకుంటోంది. ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– కూరపాటి శ్రీలక్ష్మి, తెనాలి

ఏఎస్ఎన్ ఫార్మసీ యూత్ రెడ్‌క్రాస్‌కు పురస్కారం



యూత్ రెడ్‌క్రాస్ సభ్యులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ ఫార్మసీ కాలేజీ యూత్ రెడ్‌క్రాస్ విభాగానికి తెలంగాణ మేధావుల ఫోరం బెస్ట్ యూత్ రెడ్‌క్రాస్ అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన స్వామి వివేకానంద 160వ జయంత్యుత్సవాల ముగింపు రోజున ఏఎస్ఎన్ ఫార్మసీ యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థుల సేవను అభినందిస్తూ బెస్ట్ యూత్ రెడ్‌క్రాస్ అవార్డును ఆ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య చేతులమీదుగా బహూకరించింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు నేషనల్ యూనిటీ అవార్డును అందజేసి సత్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి కూడా వీరితో ఉన్నారు. శుక్రవారం కాలేజీలో ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణను, యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు ధనుంజయ్, సాయినితిన్, లక్ష్మణ్,నాగార్జునరెడ్డి, సుమలత, దివ్య, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ టి.లక్ష్మీదుర్గను అభినందించారు.

పంచముఖ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



చంద్రప్రభ వాహనంపై స్వామి ఊరేగింపు

తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజున శుక్రవారం ఉదయం స్వామికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో యాజ్ఞికులు రఘురామ్, నాగమారుతీ వైదిక క్రతువును ఆగమయుక్తంగా నిర్వహించారు. రాత్రికి చంద్రప్రభ వాహనంపై స్వామి ఊరేగింపు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మక 'కొలంబియా'లో మెడిసిన్ పీజీకి డాక్టర్ సిద్ధార్థ



డాక్టర్ ఘంటా సిద్ధార్థ్

తెనాలి: పట్టణానికి చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ ఘంటా సిద్ధార్థ్ అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో యూరాలజీ స్పెషలైజేషన్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్‌కు ఎంపికయ్యారు. న్యూయార్క్‌లోని ఈ యూనివర్సిటీ అమెరికా దేశంలో గల మూడు ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. పట్టణ అయితానగర్‌కు చెందిన ఘంటా వెంకట వేణుగోపాల్, మాదల వెంకట విజయలక్ష్మి దంపతుల కుమారుడు సిద్ధార్థ్. 1995లో గుంటూరులోని మిషనరీ హాస్పిటల్‌లో జన్మించాడు. ఎం.ఫార్మ్ చేసిన వెంకట వేణుగోపాల్ అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఫార్మసీ స్టోర్ నిర్వహిస్తున్నారు. బీటెక్ చేసిన ఆయన భార్య వెంకట విజయలక్ష్మి అక్కడే ఐబీఎంలో పనిచేస్తున్నారు. వీరి కుమారుడైన సిద్ధార్థ్ ఇక్కడ ఆరో తరగతి చదువుతుండగా తల్లిదండ్రులతోపాటు అమెరికా వెళ్లాడు. క్లీవ్‌లాండ్ పిట్స్‌బర్గ్ మెడికల్ స్కూల్‌లో ప్రీ మెడిసిన్ కోర్సు పూర్తిచేశాడు. యూరాలజీలో స్పెషలైజేషన్ కోసం పోస్టు గ్రాడ్యుయేషన్‌కు కొలంబియా యూనివర్సిటీలో అడ్మిషను లభించింది. ఈ మేరకు గురువారం సమాచారం అందినట్టు ఇక్కడకు ఫోనులో తెలియజేశారు.

సంక్షేమ క్యాలెండర్ అమలు ఘనత సీఎందే

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 29వ వార్డులో కొనసాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 29వ వార్డు సుల్తానాబాద్ వడ్డెర కాలనీ నుంచి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 29వ వార్డు కౌన్సిలర్ రమావత్ కవితాభాయ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ మాలోతు బిక్షాలు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు రమావత్ శ్రీను నాయక్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. వార్డులోని ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పేద ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వ విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలను తీసుకువచ్చినట్టు వివరించారు. ఇంగ్లిషు మీడియంలో విద్యాబోధన, 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేసినట్టు వెల్లడించారు. 29వ వార్డులో ఎక్కువ మంది ఎస్టీలు నివసిస్తున్నారని, ప్రతి ఇంట్లో ఒకటి నుంచి మూడు వరకు సంక్షేమ పథకాలు అందుతున్నట్లు లబ్ధిదారులే తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారని ఎమ్మెల్యే నిధులతో దానిని త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, యాతాటి అనిల్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, నందివెలుగు సర్పంచ్ ధూళ్ళిపాళ్ళ పవన్, 29వ వార్డు నాయకులు బలుగూరి సురేష్, వెంకటేశ్వర్లు, కొతవరపు రమణ, యనమల ఈశ్వర్, మల్లెల యల్లమంద, రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్ కుమార్, కాకి దేవసహాయం, కేసరి కృష్ణారెడ్డి, చుండూరి వెంకటేశ్వరరావు, కాళిదాసు వెంకటేశ్వరరావు, కఠారి హరీష్, చుండూరు సాయి, బండ్లమూడి భాస్కరరావు, దేవరపల్లి కిషోర్, కోలా వాసు, శానంపూడి రఘురామిరెడ్డి, అడుసుమల్లి శ్రీనివాసరావు, తాడిబోయిన పోలేశ్వరరావు, ఈద్గా గౌస్, భీమవరపు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

లైంగిక దాడి నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన బాలిక ఇంటర్ చదువుతోంది. ఆమె అక్క బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమెతో కలిసి చదువుతున్న కోటప్పకొండకు చెందిన 18 ఏళ్ల సాయి వెంకటలక్ష్మీనారాయణ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆమెకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక, కుటుంబ సభ్యులు ఇటీవల పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసిన త్రీ టౌన్ సీఐ యు.శ్రీనివాసులు నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

వేధింపులపై కేసు నమోదు

కొల్లూరు: వ్యసనాలకు బానిసై భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కొల్లూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. ఆవులవారిపాలేనికి చెందిన విప్పర్ల ప్రియాంకకు రెండేళ్ల క్రితం భట్టిప్రోలు మండలం కోళ్లపాలేనికి చెందిన బుస్సా వాసుతో వివాహం జరిగింది. ఈ క్రమంలో వాసు వేధిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. వేధింపులు అధికమవడంతో పోలీసులను ఆశ్రయించింది.

అధిక యూరియా వాడకం అనర్థదాయకం



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరావు

కొల్లిపర: జొన్న, మొక్క జొన్న పంటల్లో రైతులు అధిక యూరియా వాడకం వల్ల లాభం కన్నా.. అనర్థమే ఎక్కువని తెనాలి ఏడీఏ కె.వెంకటరావు చెప్పారు. శుక్రవారం పలు గ్రామాల్లో జొన్న, మొక్క జొన్న పంటల్లో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలంలో రబీలో 45 వేల ఎకరాల్లో జొన్న, మొక్క జొన్న సాగు చేస్తున్నట్లు తెలిపారు. రెండు పంటలకు రైతులు శాస్త్రవేత్తల సిఫారసుకు మించి అధిక మోతాదులో యూరియా వాడుతున్నట్లు గమనించినట్లు పేర్కొన్నారు. మొక్కజొన్న సాగులో ఎకరానికి ఏయే ఎరువులు ఎంతమేర వాడాలో వివరించారు. అధిక వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

అచ్యుతాష్టకం కంఠస్థ పఠనంలో విద్యార్థి ప్రతిభ

భట్టిప్రోలు: గుంటూరులోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన అచ్యుతాష్టకం కంఠస్థ పఠన పోటీలలో భట్టిప్రోలు విద్యార్థి సత్తా చాటాడు. తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భట్టిప్రోలు మాతా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 5వ తరగతి విద్యార్థి సుంకర దేవరాజ్ ప్రథమ స్థానం సాధించాడు. రామాయణం, మహాభారతం రెండు భాగాలకు సంబంధించిన మూడు గ్రంథాలను నిర్వాహకులు దేవరాజ్‌కు బహూకరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కీసర పార్థసారథి శర్మ, బూర్లె అరుణ కుమారి, నందిపాటి తులసి వ్యవహరించారు. టీటీడీ, హెచ్‌డీపీపీ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకురాలు ఇ. అమ్మడు పోటీలను పర్యవేక్షించారు. శుక్రవారం హైస్కూల్‌లో దేవరాజ్‌ను ప్రిన్సిపల్ కొత్తా రవితేజ, ఉపాధ్యాయులు చొడవరపు అరుణ, కొతరపు సృజన, కొత్త దీపిక, హేమలత, శివాని అభినందించారు.

మరో ఇద్దరు లిక్విడ్ గంజాయి విక్రేతల అరెస్టు

నగరంపాలెం: లిక్విడ్ గంజాయి విక్రయం కేసులో మరో ఇద్దరు యువకుల్ని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ గుంటూరు–2 స్టేషన్ సీఐ ఎం.రమేష్ శుక్రవారం తెలిపారు. ఎస్ఈబీ గుంటూరు–2, డీఎస్ఈఓ బృంద పోలీసులు బుధవారం గుంటూరు క్లబ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమయంలో బేల్దారి మేస్త్రీ జె.వెంకటేశ్వర్లును అదే రోజు అరెస్ట్ చేసి, రూ.1.40 లక్షల విలువైన లిక్విడ్ గంజాయి, మోటారు సైకిల్‌ను సీజ్ చేశారని చెప్పారు. ఆ రోజు పరారైన మారుతీనగర్‌కు చెందిన తాజుద్దీన్‌ను గురువారం అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో అతనితోపాటు అదే ప్రాంతానికి చెందిన శివప్రసాద్‌ను అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. ఇంటర్ వరకు చదివి, చెడు వ్యసనాలకు బానిసగా మారి దురాశతో లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు.

అమర వీరుల స్మారక సభ రేపు

భట్టిప్రోలు: సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం రేపల్లెలోని నెహ్రూ బొమ్మ వద్ద పాత రేపల్లె తాలూకా కమ్యూనిస్ట్ ఉద్యమంలో ప్రాణాలు విడిచిన అమర వీరుల స్మారక సభ నిర్వహించనున్నట్లు మండల కార్యదర్శి జి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర, జిల్లా ప్రజా నాట్య మండలి నాయకులు వి.శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

మార్గదర్శకుడు విశ్వనాథ్



తెనాలిలో నన్నపనేని వెంకట్రావు అవార్డు స్వీకరించిన సందర్భంగా..(ఫైల్)



అంగలకుదురులో స్వర్ణకంకణంతో సత్కరించిన రావినూతల శ్రీరామమూర్తి (పాతచిత్రం)



విశ్వనాథ్, సాగర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దిలీప్‌రాజా తదితరులు

తెనాలి: కళల కాణాచి, ఆంధ్రాప్యారిస్ తెనాలితో దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్‌కు మంచి అనుబంధముంది. సూపర్‌స్టార్ కృష్ణ తొలి సినిమా తేనెమనసులు సినిమాకు ఆయన సహాయ దర్శకుడు. ఆ సినిమా కోసమని కృష్ణకు నటనలో శిక్షణ ఇచ్చారు. తర్వాత కృష్ణతో కన్నెమనసులు, ఉండమ్మా బొట్టుపెడతా, నేరము–శిక్ష వంటి సినిమాలు తీశారు.

- తెనాలికి చెందిన ఊర్వశి శారదతో ఆమె పేరుతోనే సినిమా చేశారు. ఆ సినిమాకు తెనాలికి చెందిన అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ సంభాషణలు రాశారు. బొల్లిముంత పేరుతో ప్రదానం చేసిన అవార్డును విశ్వనాథ్ 2012లో తెనాలిలో స్వీకరించారు.
- తెనాలికి చెందిన రాజ్యలక్ష్మిని వెండితెరకు పరిచయం చేశారు విశ్వనాథ్. శంకరాభరణం సినిమాకు కొత్త నటీనటులు కావాలని రచయిత, దర్శకుడు జంధ్యాలకు సూచించటంతో ఆయన రాజ్యలక్ష్మి పేరును సూచించారు. ఎలాంటి టెస్ట్ లేకుండానే ఆమెను ఎంచుకున్నారు విశ్వనాథ్. మేకప్ లేకుండానే ఒరిజినల్‌గా నటించాలని చెప్పారు. భయపడుతున్న ఆమెకు ధైర్యం చెప్పి నటింపజేశారు. ఆ సినిమా రాజ్యలక్ష్మి ఇంటిపేరునే మార్చేసింది. శంకరాభరణం రాజ్యలక్ష్మిగా పేరు తెచ్చింది.
- హిందూ కాలేజీలో ఒకసారి సాంస్కృతిక కార్యక్రమంలో 'పక్షి లేని దిక్కులు' అనే నాటికను విశ్వనాథ్ తిలకించారు. అందులో నటించిన రావినూతల శ్రీరామమూర్తి తెనాలి సమీపంలోని అంగలకుదురుకు చెందిన వారు. ఆయన విశ్వనాథ్ దగ్గర కొద్దిరోజులు సహాయకుడిగా పనిచేశారు. తర్వాత పంచాయతీరాజ్ సర్వీసులోకి వెళ్లినా విశ్వనాథ్‌పై అభిమానం చెరిగిపోలేదు. 2012లో విశ్వనాథ్ తెనాలి వచ్చినపుడు శ్రీరామమూర్తి అంగలకుదురులోని తన ఇంటికి పిలిచి పాదపూజ చేసి స్వర్ణకంకణంతో సత్కరించారు.
- తెనాలికి చెందిన నన్నపనేని రాజకుమారి ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు విశ్వనాథ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు లభించింది. ఆ సందర్భంగా ఆయనను తెనాలికి ఆహ్వానించగా రాలేని పరిస్థితుల్లో ఉన్నట్టు సమాచారం వచ్చింది. దీంతో నన్నపనేని స్వయంగా హైదరాబాద్ వెళ్లి విశ్వనాథ్ దంపతులను సత్కరించారు.
- 1974లో ఓ సీతకథ సినిమా వచ్చినపుడు తెనాలిలో ఉత్తమ చలనచిత్ర అభిమానుల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ఆధ్వర్యంలో విశ్వనాథ్‌ను సత్కరించారు. స్థానిక రాజకీయ ప్రముఖుడు, విద్యాదాత నన్నపనేని వెంకట్రావు పేరిట ఇస్తున్న అవార్డును తెనాలిలో 2017లో విశ్వనాథ్ స్వీకరించారు. విశ్వనాథ్ తీసిన ఆణిముత్యాలనదగ్గ సినిమాలను పూనాలోని ఫిలిం ఆర్కైవ్స్‌లో భద్రపరచాలని డాక్టర్ దక్షిణామూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.
- తెనాలిలోని సాహితీ, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు, కుటుంబసభ్యులు ఇటీవలే హైదరాబాద్ వెళ్లి విశ్వనాథ్ కుటుంబంతో ఆత్మీయతను పంచుకున్నారు.

విశ్వనాథ్ ఓ పెదబాలశిక్ష

తెనాలిటౌన్: దర్శకులందరికీ విశ్వనాథ్ పెద్ద బాల శిక్షలాంటి వారని మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. మా ఏపీ కార్యాలయంలో శుక్రవారం దర్శకులు కె.విశ్వనాథ్, సాగర్ సంతాప సభ నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో దిలీప్‌రాజా మాట్లాడుతూ దర్శకుడూ కార్మికుడేనని ఖాకీ యూనిఫాం ధరించిన మహనీయుడు విశ్వనాథ్ అని గుర్తు చేశారు. చిన్నస్థాయి నుంచి వచ్చి కమర్షియల్ డైరెక్టర్‌గా విజయాలను సొంతం చేసుకున్న దర్శకుడు సాగర్ మరణం కూడా జీర్ణించుకోలేదని, ఆయన ప్రతిభాశాలి అని దిలీప్‌రాజా చెప్పారు. కార్యక్రమంలో సహాయ దర్శకుడు లక్ష్మణ శాస్త్రి, భాను మున్నంగి, ఆరాధ్యుల కన్నా, రాఘవేంద్రరావు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

అపర సత్యభామ జమున



జమున చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారుల సంఘ నాయకులు

తెనాలిటౌన్: చలనచిత్ర పరిశ్రమలో అపర సత్యభామగా జమున పేరుపొందారని పలువురు దర్శకులు, కళాకారులు పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీ పట్టణ రంగస్థల కళాకారుల భవనంలో శుక్రవారం సినీ నటి జమున సంతాప సభను నిర్వహించారు. సభకు సంఘ ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు స్వాగతం పలకగా సంఘ అధ్యక్షులు ఎం.సత్యనారాశెట్టి అధ్యక్షత వహించారు. సినీ నటులు వేమూరి విజయభాస్కర్ మాట్లాడుతూ ఇటీవల మృతి చెందిన కృష్ణ, జమున, కైకాల సత్యనారాయణ, తాజాగా దివికేగిన దర్శకుడు కె.విశ్వనాథ్ తెలుగు చలనచిత్ర రంగం ఉన్నంత వరకు చిరస్మరణీయులన్నారు. సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ కొత్త కళాకారులకు జమున, విశ్వనాథ్ దిక్సూచిలాంటివారన్నారు.